ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవం

విశాలాంధ్ర-పొన్నూరు : ప్రజల సౌకర్యం కోసం ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ నేటి నుంచి అందిస్తున్నట్లు పొన్నూరు ఆర్టీసీ డిపో మేనేజర్ అజిత కుమారి అన్నారు. గురువారం పొన్నూరు ఆర్టీసీ డిపో ఆవరణంలో కార్గో మాసోత్సవాలను ప్రారంభించారు. కచ్చితత్వం నాణ్యమైన కార్గో సేవలు ఆర్టీసీ ద్వారా అందిస్తున్నామన్నారు. ఆర్టీసీ డిపో సిబ్బంది పాల్గొన్నారు.

29న 'సాహితీ స్వర్ణోత్సవ' ప్రచురణల ఆవిష్కరణ సభ

విశాలాంధ్ర-గుంటూరు : జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి, సాహితీ భారతి, డాక్టర్ చిల్లర భవాని దేవి సాహితీ స్వర్ణోత్సవ ప్రచురణల ఆవిష్కరణ సభ ఈ నెల 29న ఉదయం 10 గంటలకు స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం అన్నమయ్య గ్రంథాలయంలో జరుగుతుందని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య, ఎస్ఎం సుభానీలు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ వెలుఓలు నాగ రాజ్యలక్ష్మి సభకు అధ్యక్షత వహిస్తారని 'చివరివలస' కథా సంపుటి, 'మరోచరిత్ర' నవల ప్రముఖ సాహిత్య వేత్త సోమేపల్లి వెంకటసుబ్బయ్య ఆవిష్కరిస్తారని, ముఖ్యఅతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ పాల్గొంటారని చెప్పారు. ఇదే సభలో కీర్తిశేషులు కోటంరాజు సత్యనారాయణ శర్మ దంపతుల 'సాహితీ పురస్కార' ప్రధానం వారణాసి సూర్యకుమారికి అందజేస్తారని తెలిపారు.

ఘనంగా జీ తెలుగు కుటుంబం అవార్డులు

విశాలాంధ్ర-గుంటూరు : ప్రతి ఏటా జరిగే జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ వేడుక ఈ సంవత్సరం మరింత ఘనంగా జరిగింది. వెండితెర, బుల్లితెర తారల తళుకులతో అత్యంత వైభవంగా సాగిన కుటుంబం అవార్డ్స్ 2023 ప్రధానోత్సవ కార్యక్రమం మొదటి భాగం ఈ నెల 29వ తేదీ సాయంత్రం 6 గంటలకు ప్రారంభం కానుంది. అద్భుతమైన ప్రదర్శనలతో వినోదంగా సాగే ఈ కార్యక్రమంలో మీ అభిమాన నటులు ఏ అవార్డు గెలుచుకున్నారో తెలుసుకోవాలంటే మిస్ అవకుండా చూడాల్సిందే. అంగరంగ వైభవంగా సాగిన కార్యక్రమానికి ఎనర్జిటిక్ యాంకర్స్ రవి-శ్యామల వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జీ తెలుగు కుటుంబ సభ్యులతో పాటు నేచురల్ స్టార్ నాని, రామ్ గోపాల్ వర్మ, సంయుక్తా మీనన్, రేణు దేశాయ్, అనిల్ రావిపూడి, తరుణ్ భాస్కర్, అనంత్ శ్రీరామ్, సుమ-రాజీవ్ కనకాల, రఘు బాబు, పాయల్ రాజ్పుత్, కావ్య కల్యాణ్ రామ్, అనసూయ తదితరులు హాజరయ్యారు.

ఘనంగా అమ్మవారి ఊరేగింపు, తెప్పోత్సవం

విశాలాంధ్ర-తాడేపల్లి : విజయ దశమి పురస్కరించుకొని నులకపేట 4వ లైన్ సుందరయ్య ప్రెస్ వర్క్స్ కాలనీలో అమ్మవారి భక్త బృందం ఆధ్వర్యంలో మొదటి సంవత్సరం ఏర్పాటు చేసిన శ్రీ కనకదుర్గ అమ్మ వారి విగ్రహం వద్ద శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరిగాయి. గత తొమ్మిది రోజుల నుంచి విశేష అలంకరణలతో, కుంకుమ పూజలు అందుకొని గురువారం సాయంత్రం అమ్మవారి ఊరేగింపు జరిగింది. ముందుగా అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో నులకపేట అమ్మవారి భక్త బృందం రత్నకరం అంజిరాజు, కోటం రాజు, రత్నకరం శ్రీనివాస్ రాజు, శోభన్ రాజు, సత్యనారాయణ రాజు, రామకృష్ణ, రమేష్, పెర్ల సుబ్బారావు, విజయలక్ష్మి, వింజనం గణేష్, కూరపాటి శ్రీనివాసరావు, శోభారాణి, రామరాజసుమలత, వెంకమ రాజు, భాగ్యలక్ష్మి, వెంకటనారాయణ, జ్యోతి, వెంకటేశ్వరరాజు, రాగమ్మ, బ్రహ్మ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్ ఫామ్ రిక్షాల అందజేత

విశాలాంధ్ర-తాడేపల్లి : పెనుమాకలో 10 మంది రిక్షా కార్మికులకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, తాడేపల్లి మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కొల్లి శేషుల సంయుక్త సహకారంతో గురువారం కార్యాలయం వద్ద ఫ్లాట్ ఫామ్ రిక్షాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, గ్రామ అధ్యక్షులు పాలెపు వీరేంద్రనాద్, మంగళగిరి నియోజకవర్గ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు పఠాన్ జానీ ఖాన్, మన్నవ అప్పాజీ, కర్పూరపు నాగేంద్రం, తెనాలి మాణిక్యం, కోటా స్వర్ణలత, తరిగోపుల లక్ష్మీప్రసన్న, కోటా పృథ్వీ, బాణావత్, నాగరాజు నాయక (బుజ్జి), బాణావత్ రాములు నాయక్, షేక్ ఖాదర్, బొక్కా కాటయ్య, బొక్కా లవకుశ, రావూరి సాంబయ్య, భూక్యా సేవా నాయక్, మన్నవ ఫణి, అందే బాబూరావు, భూక్యా సైదులు నాయక్ పాల్గొన్నారు.

వీవీఐటీలో 'నరకాసుర' చిత్రబృందం సందడి

విశాలాంధ్ర-గుంటూరు : యువ నటీనటులు రక్షిత్ అట్లూరి, అపర్ణా జనార్థన్, సంకీర్తనా విపిన్ ప్రధాన పాత్రధారులుగా సెబాస్టిన్ దర్శకత్వంలో సుముఖ క్రియేషన్స్, ఐడీఎల్ ఫిల్మ్ మేకర్స్ బ్యానర్‌పై రూపొందుతున్న చిత్రం 'నరకాసుర'. ఈ చిత్రం నవంబర్ 3న విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర ప్రచారంలో భాగంగా చిత్రబృందం వీవీఐటీ కళాశాలను సందర్శించారు. చిత్రనటులు, వీవీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరో రక్షిత్ అట్లూరి మాట్లాడుతూ అందరినీ ఆకట్టుకునే విధంగా ఈ చిత్రం రూపొం దించారని, ఈ చిత్రం యాక్షన్, కామెడీ, ఎమోషన్ మేళవింపుతో ఉం టుందని తెలిపారు. మంచి సినిమాలు చేసి గుర్తింపు తెచ్చుకోవడమే ధ్యేయమన్నారు. విద్యార్థులతో కలిసి నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు.

అరవింద విద్యార్థికి ఐఐటీలో సీటు

విశాలాంధ్ర-తాడేపల్లి : అరవింద హైస్కూల్ కుంచనపల్లి పూర్వ విద్యార్థి మాజేటి తేజో రాం విగ్నేశ్వర్ ప్రతిష్టాత్మక ఇండోర్ ఐఐటీలో సీటు సాధించినందుకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అతన్ని గురువారం అభినందించారు. ప్రిన్సిపల్ బి.ఇంద్రాణి మాట్లాడుతూ విగ్నేశ్వర్ ఎప్పుడు మార్కుల కోసం చదవ లేదని, ప్రతి పాఠాన్ని బాగా అర్థం చేసుకొని చదివేవాడని గుర్తు చేసుకున్నారు. విశ్నేష్ తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలిద్దరూ అరవింద స్కూలు విద్యార్థులేనని, అరవింద పాఠశాలలోనే ఒత్తిడి లేని చదువు, ఇక్కడ అధ్యాపక బృందం బోధన పద్ధతులు తమ పిల్లలకు మంచి పునాది వేశాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బి.ఇంద్రాణి, అకాడమిక్ ఇన్‌చార్జ్ సిహెచ్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-తాడికొండ : గుంటూరు నగరంలోని తాడికొండ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో వైసీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ గురువారం 10 మంది బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో పది మందికి రూ.15.35 లక్షల చెక్కులను అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సురేష్ కుమార్ తెలియజేశారు.

మాదకద్రవ్యాలపై ఉపాధ్యాయులకు వర్క్‌షాప్

విశాలాంధ్ర-మంగళగిరి : నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో మంగళగిరి మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై వర్క్‌షాప్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అనంతరం నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాల వలన విద్యార్థుల జీవితాన్ని నిలువెల్లా నాశనం చేస్తోందని, సరదాగా అలవాటు చేసుకొని చివరకు మత్తు పదార్థాలు లేకుండా ఉండలేని పరిస్థితికి వస్తున్నారని, మత్తు మైకంలో చదువుకు దూరమవుతూ విలువైన శక్తిని నిర్వీర్యం చేసుకుంటున్నారని, మాదక ద్రవ్యాల వ్యసనపరులను గుర్తించి వారిని సంబంధిత పునరావాస కేంద్రాలను సంప్రదించి చికిత్స ద్వారా సాధారణస్థితికి తీసుకురావాలని, ఎవరైనా మాదక ద్రవ్యాలకు బానిసలైన వారిని ముందుగా గుర్తించి, సరైన అవగాహనా, కౌన్సిలింగ్ డి అడిక్షన్ సెంటర్లకు పంపించాలని ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా తీసుకొని పని చేయాలని అన్నారు. అనంతరం నీతోడు మానసిక వికాస కేంద్రం సైకాలజిస్టు జి.అనూష మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు సోషల్ మీడియా కీడు ఎక్కువగా చేస్తుందని, మత్తు పదార్థాలు మనకి ప్రస్తుత కాలంలో అన్ని ప్రదేశాలలో అందుబాటులో ఉంటున్నాయని, వ్యక్తులలో ఒంటరితనం, డిప్రెషన్‌కు సోషల్ మీడియా కారణమవుతుంది. తద్వారా అనేక మందిలో మందిలో నిద్ర లేమికి కారణమవుతుందని అనేక అధ్యయనాలు పేర్కొంటున్నాయన్నారు. ఇలాంటి సమస్యలతో ఉన్న విద్యార్థులు, యువత 9490492020 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. మండల విద్యాశాఖ అధికారి జి.సత్యన్నారాయణ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయని, అంతేకాక మనం నిత్యజీవితంలో చాలా మంది విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు బానిసలై పోతున్నారని, సరైన అవగాహనతో మాదకద్రవ్యాలను కట్టడి చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్ బి.రమేష్, మండల విద్యాశాఖ అధికారి ఎన్.బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరాలజీ వార్డు ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ సమగ్ర (జీజీహెచ్)ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ గురువారం యూరాలజీ వార్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ వార్డులో ఉండాల్సిన రూ.2కోట్ల విలువ గల లితో ట్రిప్సీ పరికరం లేకపోవడాన్ని ఆయన గుర్తించారు. ఆ పరికరం ఎక్కడుంది అని వాకబు చేస్తే ఆప్తమాలజీ వార్డులో ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆయన అసహనాన్ని వ్యక్తంచేశారు. త్వరితగతిన ఆ పరికరాన్ని యూరాలజీ వార్డుకు తరలించాలని అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా వార్డులోని ఎస్ఓటీని ఆయన పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్న ల్యాప్రోస్కోపిక్ మిషన్‌కు మానిటర్‌ను తక్షణమే అమర్చాలని, రూ.10 లక్షల విలువ గల వేజల్ సీలర్ అనే దయాదర్మీ పరికరాన్ని మరమ్మతులు చేసి గైనకాలజీ విభాగానికి పంపించాలని ఆయన ఆదేశించారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ యూరాలజీ వార్డులో ఖాళీగా ఉన్న స్టోర్ రూమ్‌లో ఈ పరికరాన్ని ఏర్పాటు చేసి రోగులకు అందుబాటులో ఉంచాలని ఆయన అన్నారు. స్టోర్ రూమ్‌లో ఉన్న సామాగ్రిని లంబార్ రూమ్‌లోకి మార్చాలని సీఎస్ ఆర్ఎంఒకు ఆదేశించారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డీఎస్ఎస్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్, ఆర్ఎంఓ డాక్టర్ సతీష్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ సమీనా బేగం తదితరులు ఉన్నారు.

కంద రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : కంద పంట వేసిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు అన్నారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన కంద పొలాలను పరిశీలించారు. పలువురు రైతులు కంద పంటకు పందు తెగులు రావడం వలన నష్టపోయామని రైతు సంఘం నాయకులు దృష్టికి తీసుకువచ్చారు. శివశంకరరావు మాట్లాడుతూ వాణిజ్య పంటలలో కంద పంటకు పెట్టుబడి భారీగా అవుతుందని అన్నారు. ఒక్కో ఎకరానికి గతంలో 100 పుట్లు వరకు దిగుబడి సాధించేదని, ప్రస్తుతం పందు తెగులు రావడం వలన 30 పుట్లు కంటే దిగుబడి రావటం లేదని అన్నారు. కంద విత్తనం ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి, పొలంలో నాటి, పెట్టుబడులు పెట్టి, రైతు చేతికి పంట వచ్చేనాటికి మొత్తం పెట్టుబడి ఖర్చు మూడు లక్షల వరకు అవుతుందని అన్నారు. నష్టపోయిన కంద పంట రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దొంతి రెడ్డి వెంకటరెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

సైదారెడ్డి సేవలు మరువలేనివి: పురందేశ్వరి

విశాలాంధ్ర-గుంటూరు : తాను నమ్మిన సిద్ధాంతం కోసం ఊపిరి ఉన్నంతవరకు నిలబడిన అసమాన్యమైన వ్యక్తి సైదారెడ్డి అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఏబీవీపీ పూర్వ విదర్భ(మహా రాష్ట్ర) ప్రాంత సంఘటనా కార్యదర్శి, ఏపీ బీజేపీ బిల్డింగ్ కమిటీ ఛైర్మన్ కాయితీ సైదారెడ్డి సంస్మరణ కార్యక్రమం గుంటూరు కృష్ణనగర్ మెయిన్‌రోడ్డులోని గోల్డెన్ హోమ్స్‌లో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన పురందేశ్వరి సైదారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీకి అంకితభావంతో పనిచేసిన నేత సైదారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. చివరివరకు ఆయన పార్టీకి సేవలు అందించారని, నిబద్ధతతో పనిచేసిన నాయకుడిని పార్టీ కోల్పోయిందని అన్నారు. ఆయన పార్టీ కోసం చేసిన సేవలు ఎప్పటికీ మరువలేమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ, జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్రకుమార్, దయాకర్ రెడ్డి, షేక్ బాజీ, ఉప్పలపాటి శ్రీనివాసరాజు, ఈదర శ్రీనివాసరెడ్డి, స్వరూపరాణి, పాలపాటి రవికుమార్, భీమినేని చంద్రశేఖర్, కుమార్ గౌడ్, తిరుపతిరావు, సుబ్బారావు, తోట రామకృష్ణ, టీవీ రావు, పద్మనాభం, వెలగలేటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న పైర్లకు నీరందించండి

విశాలాంధ్ర-పొన్నూరు : ఖరీఫ్ సీజన్ మధ్యలోనే వ్యవసాయానికి సాగు నీరు అందకపోవటం ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి అన్నారు. గురువారం పొన్నూరు మండల పరిధిలోని శ్రీ రంగపురం ఛానల్ ఆయకట్టు వరి పంట పొలాలను పరిశీలించారు. నీరందక ఎండుతున్న వరి, జామ, బొప్పాయి పొలాలను సందర్శించి, రైతులతో మాట్లాడారు. తక్షణమే అధికారులు స్పందించి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై అవగాహన

విశాలాంధ్ర-పొన్నూరు : పాఠశాల దశ నుంచే ప్రతి విద్యార్థి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై అవగాహన కలిగి ఉండాలని 'డీడ్స్' సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ విజయవర్ధన్ మంచాల అన్నారు. గురువారం పొన్నూరులో సెయింట్ థామస్ కేరళ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. పేదరికాన్ని నిర్మూలించటం, లింగ సమానత్వం తదితర 17 అంశాలను వివరించి విద్యార్థులతో ముఖాముఖి చర్చించారు. రూబెన్ కృష్టాఫర్ మురారి, ప్రిన్సిపల్ రోజ్ థామస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీని కలిసిన జడ్పీ ఛైర్‌పర్సన్

విశాలాంధ్ర-గుంటూరు : పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్‌ను ఆయన కార్యాలయంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినా గురువారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్‌కు రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న పనులను గురించి వారు చర్చించారు.

ఉద్యోగుల జీపీఎఫ్, జీఎల్ఐ డబ్బులు జమ చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రభుత్వ ఉద్యోగుల దాచుకున్న జీపీఎఫ్ రుణాలు గత 6 నెలల నుంచి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకపోవడం దుర్మార్గమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఈ విషయమై చాంద్‌బాషా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి లేఖ రాసి పంపారు. ఈ సందర్భంగా చాంద్‌బాషా మాట్లాడుతూ సరెండర్ లీవులతో పాటు ఏపీ జీఎల్ఐ బిల్లులు కూడా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగులు దాచుకున్న ఏపీ జీఎల్ఐ బాండ్ల మెచ్యూరిటీ అయినా కూడా నేటి వరకు ఉద్యోగులకు చెల్లించలేదని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్ డబ్బులు, సరెండర్ లీవ్ బిల్లులు, జీఎల్ఐ మెచ్యూరిటీ డబ్బులు ఉద్యోగ ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ హక్కుల ప్రధాన అజెండగా పని చేసే ఏకైక సంఘం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్యామ్ హుస్సేన్‌ఖాన్, సంయుక్త కార్యదర్శి ఎల్.భరత్ కుమార్, నగరశాఖ అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, నగర శాఖ పొన్నూరు తాలూకా యూనిట్ అధ్యక్షులు హరిబాబు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫైబ్రోస్కాన్ ద్వారా వ్యాధి నిర్ధారణ పరీక్షలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : లివర్ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 60 మంది పేషంట్లకు రూ.10వేలు విలువ చేసే ఫైబ్రోస్కాన్ ద్వారా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ అండ్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ నాగూర్ బాషా పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక గుంటూరు వారితోట 7వ లైను నందు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం జరిగింది. తొలుత పేషంట్ల ఆరోగ్యపరమైన పరిస్థితులను డాక్టర్ నాగూర్ బాషా అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ నాగూర్ బాషా మాట్లాడుతూ వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేషంట్లు ఉచితంగా నిర్వహించిన వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని కోరారు. కేర్‌వెల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్.గౌస్ బాషా మాట్లాడుతూ త్వరలో మరో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి సమాచారం కోసం 83417 13713, 98547 57999 నెంబర్లను సంప్రదించాలని గౌస్‌బాషా పేర్కొన్నారు.

అడ్డదారుల్లో గెలుద్దామని చూస్తే వైసీపీకి బుద్ధి చెప్తాం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్ : రాష్ట్ర తెలుగు దేశం పార్టీ ఆదేశాల మేరకు గుంటూరు పశ్చిమ టీడీపీ ఇన్‌ఛార్జ్ కోవెల మూడి రవీంద్ర (నాని)అధ్యక్షతన గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఓటర్ వెరిఫికేషన్, 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' అనే కార్యక్రమం గురించి...చంద్రబాబు అక్రమ అరెస్ట్ గురించి ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించాలని ఈ సమావేశంలో పేర్కొన్నారు. రెండు రోజుల్లో ఓటర్ జాబితా విడుదల కాబోతుందని, ఆ ప్రకారం అక్రమ ఓట్లు నమోదైతే వెంటనే ఎన్నికల కమిషన్‌కు నివేదించడం జరుగుతుందని ఆయన అన్నారు. పర్చూరులో ఏమి జరిగిందో కింది స్థాయి అధికారులు గుర్తుంచుకుని న్యాయబద్ధంగా నడుచుకుంటే బాగుంటుందని హితవు పలికారు. టీడీపీ సానుభూతి పరుల ఓట్లు తొలగించి అడ్డదారుల్లో గెలుద్దామని చూస్తే వైసీపీ ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పరిశీలకులు కనకాచారి, కొమ్మినేని కోటేశ్వరావు, ఈరంటి వర ప్రసాద్, మానుకొండ శివ ప్రసాద్, చింతకాయల రామారావు, సుఖవాసి శ్రీనివాసరావు, కనపర్తి శ్రీనివాసరావు, తాళ్ల వెంకటేష్ యాదవ్, మన్నవ సుబ్బారావు, కసుకుర్తి హనుమంతరావు, లాల్ వజీర్, ఆడక శ్రీనివాస్, పేరయ్య, మహమ్మద్ రఫీ, రావిపాటి సాయి, పోపూరి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సెస్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-పొన్నూరు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో వచ్చే నెల 3 నుంచి సెస్(స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని ఎంఈఓ-2 శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయుల ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. 3, 6, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఎంఈఓ-1 రుద్రపాటి శోభాచంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యానాదులపై దాడి ఖండన

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మోపిదేవి మండలం కొక్కిలిగడ్డ కొత్తపాలెం గ్రామానికి చెందిన యానాది మహిళలపై దాడి చేసి తీవ్రంగా హింసించిన కాపు కులస్థుడైన మత్తి రాజబాబు తను ఇంట్లో చెవ్వుపోగులు పోయాయని, మీరే తీశారని ఆ మహిళలను కొట్టడాన్ని బహుజన మహాసభ జాతీయ సెంటర్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్‌సింగ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావులు గురువారం ఓ ప్రకటనలో ఖండించారు. మోపిదేవి ఎస్ఐ వాస్తవ విషయాలు తెలుసుకోకుండా అధికార పార్టీ నాయకుడు చెప్పాడని ఆ ముగ్గురు మహిళలను ఎస్ఐ కొట్టడం దారుణమన్నారు. ఆ యానాది మహిళలకు న్యాయం జరిగే వరకు తాము వారికి మద్దతుగా ఉంటామన్నారు.

జగనాసురుడి పీడ ప్రజలే వదిలిస్తారు..

విశాలాంధ్ర-మంగళగిరి : నిత్యం పరదాలు, ఫెన్సింగ్‌లు పెట్టుకుని తిరిగడంతోనే జగన్ రెడ్డి మనస్తత్వం ఏంటో ప్రజలకు అర్థమైపోయిందని, ప్రజలు ఇవ్వబోయే తీర్పు ఎలా ఉంటుందో స్పష్టంగా తెలుసునని, అందుకే పరదాల చాటున తిరుగుతున్నాడని గుంటూరు పార్లమెంటరీ పద్మ శాలి సాధికార సమితి సభ్యుడు వంగర పెద్ద లక్ష్మయ్య అన్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసినంత మాత్రాన ఆయన్ని ప్రజల నుంచి దూరం చేయడం ఎవరి తరమూ కాదన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ, చంద్రబాబుతోనే మేమున్నామని చెబుతూ బాబుతో నేను' కార్యక్రమాన్ని మంగళగిరి పట్టణంలోని ఎనిమిదో వార్డ్, డాక్టర్ ఆంజనేయ కాలనీలో నిర్వహించారు. 2024లో అభివృద్ధికి అరాచకానికి మధ్య యుద్ధం జరగబోతోందని, ప్రజలంతా అభివృద్ధి బాంధవుడైన చంద్రబాబుతోనే ఉన్నారన్నారు. జగన్ రెడ్డి నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో సృష్టించిన విధ్వంసమే అతన్ని, అతని పాలనను అంతం చేయబోతున్నాయన్నారు. జగన్ రెడ్డి కుట్రలు, కుతంత్రాలను వచ్చే ఎన్నికల్లో కూల్చి చంద్రబాబుకు అసలుసిసలైన బహుమానం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గోవాడ దుర్గారావు, వాకా మాధవరావు, అలుగురి వీరాంజనేయులు, కేసన అరుణకుమారి, బండారు సీతారామయ్య, తాటి సాంబశివరావు, పంచల వెంకటేశ్వరరావు, వంగర శివ లీల, తాటి శైలజ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు శ్రీరామరక్ష

విశాలాంధ్ర, తెనాలి : జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు శ్రీరామరక్ష అని, ఎంతో మేలు చేస్తుందని తెనాలి మున్సిపల్ ఇన్‌ఛార్జి చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ అన్నారు. స్థానిక పద్మశాలి పేట మున్సిమస్తాన్ మున్సిపల్ ఉర్దూ ఎలిమెంటరీ స్కూల్ ఆవరణ యందు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు. జనరల్ ఓపి 29 మంది, ఆర్థోపెడిక్ ఓపి 26 మంది, జనరల్ సర్జరీ ఓపి 16 మంది అప్తమాలజి ఓపి 27 మందిని పరీక్షించడం జరిగింది. కార్యక్రమంలో వైసిపి 19వ వార్డు ఇన్‌ఛార్జి చందూరు సాయి, మున్సిపల్ కమిషనర్ మేడికొండ జస్వంత్‌రావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కారుమూరు హెలెన్ నిర్మల, వైద్యాధికారులు డాక్టర్ డి.కిషోర్ కుమార్, డాక్టర్ దేవికావాణి, డాక్టర్ షారోన్ రంజిత్, డాక్టర్ యదునందన్, ఏసిపి సుధాకర్, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ జంగంశ్యామ్, యుయల్‌బి ఆరోగ్య విస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏ.రామచంద్రరావు, హెల్త్ విజిటర్ పుష్పలత, విజయకుమారి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యుద్ధంపై ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు : పాలస్తీనా, గాజా ప్రజలపై ఇజ్రాయిల్ నేతన్యహు ప్రభుత్వం చేస్తున్న మారణ యుద్ధకాండపై ఐక్యరాజ్యసమితి తక్షణమే జోక్యం చేసుకొని యుద్ధ విరమణకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య నగర కార్యదర్శి ఎన్.పోతురాజు డిమాండ్ చేశారు. సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక నల్లచెరువు కమ్యూనిస్టు బొమ్మల సెంటర్‌లో పెద్దఎత్తున కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇజ్రాయిల్‌పై హమాస్ చేసిన దాడులకు ప్రతీకారంగా ఆ దేశ ప్రధాని నేతన్యహు పాలస్తీనా ప్రజలపై వందల కొలది రాకెట్ దాడులు చేసి విధ్వంసం సృష్టించి నిరాయుధులైన వేలాది మంది పౌరులను, పసిపిల్లలను, మహిళలను, వృద్ధులను చంపటం అంతర్జాతీయ యుద్ధ నియమాలకు వ్యతిరేకమని అన్నారు. కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.కృష్ణ, భారత్ బచావో జిల్లా అధ్యక్షుడు బత్తుల కోటేశ్వరరావు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ఇరు దేశాలతో చర్చలు జరిపి పాలస్తీనా, ఇజ్రాయిల్‌లను రెండు దేశాలుగా విభజించి యుద్ధాన్ని నివారించి శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొండపల్లి విల్సన్, షేక్ ఖాజావలి, నల్లపు నీలాంబరం, విప్పర్ల ముత్తయ్య, ఇమ్రాన్, మిక్కిలి రాజశేఖర్, ప్రసాద్, నాగేశ్వరరావు, వేము సమత, శీను తదితరులు పాల్గొన్నారు.

రోజువారీ కూలీలకు లేబర్ కార్డులు తప్పనిసరి

విశాలాంధ్ర, తెనాలి : రోజువారీ కూలి పని చేసే కార్మికుల అందరికీ లేబర్ కార్డు తప్పనిసరని లేబర్ లైన్ స్టేట్ కో-ఆర్డినేటర్ మాధవరావు తెలిపారు. స్థానిక నందులపేట ఎస్.టి. కాలనీలో కార్మికులకు డిబిఆర్‌సి ఇండియా లేబర్ లైన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ, పని చేసే ప్రతి కార్మికునికి లేబర్ కార్డు కలిగి వుండాలని అన్నారు. ఈ లేబర్ కార్డు కలిగి వుండటం వలన ఉపయోగాలు ఎన్నో ఉన్నాయని, మెటర్నటి, యాక్సిడెంట్ మరియు అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా ఆయా సమస్యను బట్టి ఉపయోగాలు వున్నాయని తెలిపారు. లేబర్ లైన్ ఫీల్డ్ ఆఫీసర్ సురేష్‌బాబు మాట్లాడుతూ, లేబర్ కార్డుతో పాటు ఈశ్రం కార్డు ఉపయోగాలు, హెల్త్ కార్డు ఉపయోగాలు వివరించారు. డిబిఆర్‌సి ఏరియా కోఆర్డినేటర్ రాజశేఖర్ మాట్లాడుతూ, కార్మికులందరికి డిబిఆర్‌సి తరఫున నిర్వహించే స్క్రాప్ షాప్, కార్మికులకు సంబంధించిన కోఆపరేషన్ గురించి దాని ఉపయోగాలు వివరించారు. లేబర్ లైన్ ఫీల్డ్ ఆఫీసర్ ఈశ్వర్ మాట్లాడుతూ కార్మికుల సేఫ్టీ మరియు లేబర్ లైన్ యొక్క విధి విధానాలు వివరించారు. పని చేసి, వేతనాలు రాక ఇబ్బంది పడే ప్రతి కార్మికుడికి వేతనాలు ఇప్పించి మద్దతు ఇస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో మనిసిపల్ కార్మికులు, రోజువారీ కూలీలు, ఇంటిపని, మట్టి పని చేసుకునే కార్మికులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి తోపుడు బండి అందజేత

విశాలాంధ్ర-తాడేపల్లి : క్రిస్టియన్ పేటకు చెందిన వృద్ధురాలు శీలం వరలక్ష్మి ఇంటింటికి తిరిగి పూలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. వయసు మీద పడటంతో మోకాళ్ళు నొప్పులుగా ఉండి ఇంటింటికి తిరగలేకపోతున్నానని తోపుడు బండి ఇప్పిస్తే ఒక చోట పెట్టుకొని పూలు అమ్ముకుంటానని తాడేపల్లి పట్టణ వైసీపీ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి దృష్టికి తీసుకువెళ్లింది. ఆయన ఈ వృద్ధురాలు పరిస్థితిని ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి ఆ వృద్ధురాలు చిరు వ్యాపారానికి అండగా ఒక తోపుడు బండిని స్థానిక నాయకుల ద్వారా అందజేయించారు. తన పరిస్థితిని చెప్పిన వెంటనే స్పందించి తన జీవనాధారానికి తోడ్పడిన ఎమ్మెల్యే ఆర్కేకు, వేణుకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 4వ సచివాలయ కన్వీనర్లు దాసరి కుమారి, సంకురు అశోక్, బూత్ కన్వీనర్ కాండ్రు నాగరాజు, చింటూ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర, తెనాలి : స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్మెంట్ సర్వే ఫీల్డ్ లెవెల్ ఇన్విజిలేటర్స్‌గా వ్యవహరించబోయే డిగ్రీ విద్యార్థులకు ఎం.ఇ.ఓ. వి.జయంతి బాబు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం గురువారం నందుల పేట ఎన్నారై డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.ఇ.ఓ. మాట్లాడుతూ, సీస్ ఎగ్జామ్ ఇన్విజిలేటర్స్‌గా డిగ్రీ విద్యార్థులు వ్యవహరిస్తారని, అందుకు సంబంధించిన పూర్తి వివరాలను వారికి తెలియజేసేందుకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామని అన్నారు. అవగాహన కార్యక్రమానికి హాజరైన డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు డైరెక్టరు జి.లలిత ప్రసాద్ మాట్లాడుతూ, నవంబరు 3వ తారీఖున జరుగనున్న తెనాలి మండలం మరియు కొల్లిపర మండలంలోని సెలెక్టెడ్ స్కూల్స్‌లో 3,6,9 తరగతుల విద్యార్థుల అభ్యసన స్థాయి సామర్థ్యాలను పరీక్షించేందుకు స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్మెంట్ సర్వే నిర్వహించడం జరుగుతుందని పరీక్ష నిర్వహణకు సంబంధించిన ఇన్‌స్ట్రక్షన్స్ ఇవ్వడం జరిగిందన్నారు. ఇన్విజిలేటర్లకు ప్రభుత్వం గౌరవ వేతనం అందిస్తుందన్నారు. ఇప్పటికే అన్నిపాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఇందుకు సంబంధించిన సూచనలను ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా తెలియజేశారన్నారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సత్య కృష్ణప్రసాద్, కొల్లిపర మండల విద్యాశాఖ అధికారిణి వి.ఝాన్సీలత, ఎడ్యుకేషనల్ ఆఫీసు సిబ్బంది, కళాశాల ఉపాధ్యాయని ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

గుంటూరు జిల్లా, పొన్నూరు మున్సిపాలిటీ, నిడుబ్రోలు, డోర్ నెం.14-8-37 నివాసి అయిన నేను ఐచ్చు ప్రసాదు, S/o.ఐచ్చు లింగారావు(లేటు) తెలియజేయునది ఏమనగా నా తండ్రి ఐచ్చు లింగారావు S/o.పట్టయ్య పేరిట గల రిజిష్టరు విక్రయ దస్తావేజు నెం.173/1999, నెం.174/1999లు, అదేవిధంగా నా తల్లి ఐచ్చు ఆదిలక్ష్మి, W/o. లింగారావు పేరిట గల దస్తావేజు నెం.565/1999ను తీసుకుని 25-10-2023న నిడుబ్రోలులోని మా ఇంటి నుండి పొన్నూరు ఐలాండ్ సెంటరుకు ఫోటో స్టాట్ కాపీలు నిమిత్తం టూవీలర్‌పై వెళ్ళుచుండగా మార్గమధ్యలో సదరు 3 దస్తావేజులు జారి పోయినవి. ఎంత వెతికిననూ దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల పై అడ్రస్‌లో తెలియజేయగలరు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

ధర్మారావుకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని బలుసుపాడు గ్రామానికి చెందిన అంగిరేకుల ధర్మారావుకి గ్రామ టీడీపీ నేతలు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ సూచనలతో టీడీపీ నాయకులు గంటా పాపయ్య, బండి అప్పారావు సహకారంతో అనారోగ్యంతో ఉన్న ధర్మారావుకి ఈ ఆర్థిక సాయం అందించామని వారన్నారు. ఈ కార్యక్రమంలో బొంత హనుమంతరావు పాల్గొన్నారు.

ములకలూరులో ఆయుష్ వైద్య శిబిరం

విశాలాంధ్ర-నూజెండ్ల : ములకలూరు గ్రామంలో గురువారం ఆయుష్మాన్‌భవ కార్యక్రమం ఆర్.శ్రీనివాస్ ఆయుష్ వైద్యాధికారి ఆధ్వర్యంలో ఆయుష్ ఆరోగ్య మేళ కమిషనర్ ఎంబీ రాజేంద్రకుమార్, ప్రాంతీయ ఉప సంచాలకులు డాక్టర్ పద్మజాతి ఆదేశానుసారం గ్రామంలో ఆయుష్ మేళ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 57 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఆరోగ్యంపై అవగాహన కలిగించి యోగా శిబిరం నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులు, వాత వ్యాధులు, రక్త చాపము, మధుమేహం, ఆమ్లపితం వ్యాధులకు ఆయుష్ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మహాలక్ష్మి, ఆశా కార్యకర్త మరియమ్మ, సిబ్బంది గంగమ్మ పాల్గొన్నారు.

చర్లగుడిపాడులో ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర-గురజాల : జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు గురువారం చర్లగుడిపాడు గ్రామ సచివాలయం-1 పరిధిలో మెడికల్ ఆఫీసర్ ఝాన్సీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఆరోగ్య సురక్ష క్యాంపులో ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు ఎన్. వెంకయ్య, పులుకూరి లక్ష్మి, ఇద్దరు ఎంబీబీఎస్ డాక్టర్లు, కంటి డాక్టర్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది వైద్య సేవలు వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శేషమ్మ వేముల చలమయ్య, బత్తుల ప్రసాద్‌రావు, మాజీ సర్పంచ్ పోట్ల నారాయణ, యువనాయకులు కావూరు అంజి బాబు, పోటు వేణు, మణిదీప్, తండా మస్తాన్, కాస అనిల్, సెక్రటరీ శివ కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రక్షణకు శ్రమిస్తున్న పోలీసులు

విశాలాంధ్ర-ఈపూరు : సమాజం కోసం, భవిష్యత్తు తరాల కోసం, ప్రజా రక్షణ కోసం పోలీసులు అహర్నిశలు తమ ప్రాణాలను లెక్కచే యకుండా విధులు నిర్వహి స్తున్నారని ఈపూరు ఎస్సై మహమ్మద్ ఫిరోజ్ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా మండల కేంద్రమైన ఈపూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఎస్సై మహమ్మద్ ఫిరోజ్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సమాజంలో స్త్రీలు, పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజల పాత్ర ఎంతవరకు ఉంటుందని దానిపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజలు సంఘంలో నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను విద్యార్థులు ఆకలింపు చేసుకోవాలని తెలిపారు. ఎటువంటి క్లిష్ట సమస్యలు ఎదురైనప్పటికీ ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గొడవలను ప్రేరేపిస్తే ఉపేక్షించం: డీఎస్పీ

విశాలాంధ్ర-ఈపూరు : పల్లెలు అంటే ప్రశాంతతకు మారుపేరు అని, అలాంటి పల్లెలలో క్షణికావేశంతో ఒకరినొకరు ద్వేషించుకొంటూ, దాడులు ప్రతిదాడులకు దిగటం మంచి పద్ధతి కాదని, వీటిని ప్రేరేపించే వారిని ఉపేక్షించేది లేదని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నరసరావుపేట డీఎస్పీ మహేష్ అన్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ రవి శంకర్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని కొచ్చర్ల ఎస్సీ కాలనీలో ఈపూరు ఎస్సై మహమ్మద్ ఫిరోజ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పల్లెనిద్ర చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నరసరావుపేట డీఎస్పీ మహేష్, వినుకొండ రూరల్ సీఐ సుధాకర్‌రావులు హాజరై మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, ఫ్యాక్షన్ హత్యలు, దిశ యాప్ గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రజలు శాంతియుతంగా ఉండేలా పోలీసు యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. వ్యవస్థలో మార్పు కోసం అన్ని శాఖల సమన్వయంతో పనిచేస్తామని, మార్పు వచ్చినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ఇందుకోసం అధికారులే కాకుండా ప్రతి పౌరుడూ సహకరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించడానికి నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. మహిళలు భయపడకుండా సమస్యను పోలీసుల దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. దిశ చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజల్లో మార్పు రావాలంటే ప్రతిఒక్కరూ అక్షరాస్యులుగా ఉండాలన్నారు. అనంతరం సిబ్బందితో కలిసి ఈపూర్ ఎస్సై మహమ్మద్ ఫిరోజ్ పల్లెనిద్ర చేపట్టారు.

29 వరకు ఈ క్రాఫ్ ముసాయిదా జాబితా పరిశీలన

విశాలాంధ్ర-మాచర్ల: ఖరీఫ్ సీజన్ ఈ క్రాఫ్ నమోదుపై ఈనెల 29 వరకు అన్ని గ్రామ రైతు భరోసా కేంద్రాల వద్ద సామాజిక తనిఖీ ముసాయిదా జాబితా పరిశీల పరిశీలనా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వ్యవసాయ డివిజనల్ అధికారి జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం ఏ.డి.ఏ జగదీశ్వర్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ 2023 ఖరీఫ్ సీజన్‌కు గాను ఈ క్రాఫ్ నమోదు చేపించుకున్న ఆయా రైతుల పేర్లు, పంట నమోదు వివరాలను, రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శిస్తారన్నారు. పంట నమోదు వివరాల పట్ల ఏమైనా అభ్యంతరాలు ఉంటే పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో ఉన్న వీ.ఏ.ఏ, వీ.హెచ్.ఏ, బి.ఎస్.ఏ లకు వ్రాతపూర్వకంగా అర్జీ ద్వారా తెలియపరచి వెంటనే సరిదిద్దుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతాంగం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

22,354 ఎకరాల్లో పంట సాగు

విశాలాంధ్ర-సత్తెనపల్లి : సబ్ డివిజన్ పరిధిలో 22354 ఎకరాలలో పంట సాగుబడి జరుగుతున్నదని సత్తెనపల్లి సబ్ డివిజన్ ఇంచార్జీ ఏడీఏ ఎస్.శ్రీధర్ రెడ్డి తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి మండలంలో ఈ ఖరీఫ్-2023 సీజన్‌నకు 22354 ఎకరాలలో వివిధ పంటలు సాగు చేయగా 20574 ఎకరాలకు రైతుల ద్వారా ఈకేవైసీ చేయించారన్నారు. పెదకూరపాడు మండలంలో ఈ ఖరీఫ్-2023 సీజన్‌నకు 18054 ఎకరాలలో వివిధ పంటలు సాగు చేయగా 17094 ఎకరాలకు రైతుల ద్వారా కేవైసీ నమోదు చేశామన్నారు. ముప్పాళ్ల మండలంలో ఈ ఖరీఫ్-2023 సీజన్‌నకు 5241 ఎకరాలలో వివిధ పంటలు సాగు చేయగా 5032 ఎకరాలకు రైతుల ఈకేవైసీ ద్వారా చేయించడం జరిగినదని తెలిపారు. మొత్తం సబ్ డివిజన్ పరిధిలో 45649 ఎకరాలలో పంట నమోదు చేయటం జరిగిందని, 42700 ఎకరాలకు(93.5 శాతం) రైతులకు ఈకేవైసీ చేయటం జరిగిందన్నారు. ఖరీఫ్-2023 సీజన్లో ఈ క్రాప్ నమోదు అయిన పంటల వివరాలు ముసాయిదా జాబితాలను ఈ నెల 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకు సబ్ డివిజన్‌లోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద సామాజిక తనిఖీల కోసం ప్రదర్శిస్తారని చెప్పారు. రైతులు సామాజిక తనిఖీలో భాగంగా జాబితాను పరిశీలించి అభ్యంతరాలు ఏమైనా ఉంటే సవరణ కోసం రైతు భరోసా కేంద్రాలలో సిబ్బందిని సంప్రదించి అభ్యంతరాలు తెలియజేయాలని అన్నారు.

మహిళా సమాఖ్య జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి: మారుతి

విశాలాంధ్ర-నరసరావుపేట: మహిళా సాధికారిత కోసం, మహిళల హక్కుల కోసం దశాబ్దాల పాటు పోరాటాలు చేసిన చరిత్ర ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్యకు ఉన్నదని, ఈ నేపథ్యంలో జరుగుతున్న రాష్ట్ర మహిళా సమాఖ్య జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఏ మారుతి వరప్రసాద్ అన్నారు. గురువారం నరసరావుపేటలో జరిగిన మహిళా సమాఖ్య ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చట్ట సభలలో మహిళా రిజర్వేషన్ల కోసం మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కోసం, పురుషాధిక్యత ప్రపంచంలో మహిళల మీద జరుగుతున్న అత్యాచారాలు, హత్యలపై నిర్విరామంగా పోరాడుతున్నది ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అని ఆయన అన్నారు. మూఢ విశ్వాసాలపై మహిళలను చైతన్యపరుస్తూ మహిళా కార్యకర్తలను తీర్చిదిద్దుతున్నది మహిళా సమాఖ్య అన్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు చెరుకుపల్లి నిర్మల మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మద్యాన్ని పూర్తిగా నిషేదిస్తానని చెప్పి, రాష్ట్రాన్ని మద్యంధ్రప్రదేశ్‌గా మార్చారని, దీని వల్ల మధ్యతరగతి మహిళలు తీవ్రంగా నష్టపోతున్నారని, కుటుంబాలు చిన్నాభిన్నం అవ్వున్నయని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలపైన ధరల భారాలు, పన్నుల భారాలు మోపి ప్రజల నడ్డి విరుస్తున్నారు అని, 2024 ఎన్నికల్లో ప్రజావ్యతిరేక పాలకులైన నరేంద్ర మోడీ, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాలను గద్దె దించాలని ఆమె తీవ్రంగా దుయ్యబట్టారు. జిల్లా ,రాష్ట్ర మహాసభలలో మహిళలు ఎక్కువ మంది పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు. ఈ సమావేశానికి ఎస్.దేవి అధ్యక్షత వహించగా, సీపీఐ ఏరియా కార్యదర్శి సత్యనారాయణ రాజు, పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, సీనియర్ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, మహిళలు పి.లక్ష్మి, పిలుముల పిచ్చమ్మ, యశోద, దుర్గ నగమల్లేశ్వరి, తిరుమల కోటమ్మ, దుర్గ, సంజీవమ్మ, రమాదేవి, జె.బాగ్యమ్మ, రాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సొమ్ముతో అధికార పార్టీ ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర-సత్తెనపల్లి : అధికార పార్టీ ప్రభుత్వ సొమ్ము తో ఎన్నికల ప్రచారం చేస్తోందని జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు ఆరోపించారు. గురు వారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ఎమ్మెల్యే రాంబాబుకి తాను చేస్తున్న శాఖపై అవగాహన లేదని కేవలం మట్టి తవ్వ కోవటం, భూములు అక్రమణ కోసమే అంబటికి మంత్రి పదవి ఉందన్నారు. రైతులను ఆదుకునే ఆలోచన ప్రభు త్వానికి లేదని, ఈ రాష్ట్రం ఎడారిగా మారి రైతులు పరి స్థితి దారుణంగా ఉందన్నారు. మురుగు నీటిపై ఆధార పడి రైతులు పంట సాగు చేసుకునే పరిస్థితి రాష్ట్రంలో నెలకొన్నదన్నారు. వెంటనే సాగర్ కుడికాలువకు నీరు విడుదల చేయాలని, పొలాలు ఎండిపోతే మట్టి తవ్వకునే ఆలోచనలో మంత్రి అంబటి రాంబాబు ఉన్నారని తెలియజేశారు. నాగార్జునసాగర్ నుంచి గుక్కెడు నీరు తెచ్చే పరిస్థితి ప్రభుత్వానికి లేదన్నారు. పంటలకు సాగునీరును విడుదల చేయకపోతే ధర్నా చేస్తామని హెచ్చరించారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో చేస్తున్న సంకల్ప యాత్రపై ఒక జిల్లా అధ్యక్షుడిగా తనకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని కేవలం కొంతమంది వ్యక్తులు వాళ్ళ స్వలాభం కోసం చేస్తున్న కార్యక్రమంగానే తాము చూస్తున్నామని తెలియజేశారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమంలో పాల్గొంటున్న ప్రతిఒక్కరిపై ఖచ్చితంగా పార్టీ అధిష్టానం త్వరలోనే చర్యలు తీసుకుంటుందని తెలియజేశారు. సత్తెనపల్లి జనసేన రెండు వర్గాలు లేవు అందరూ ఒకటిగానే ఉన్నారని తెలియజేశారు. సమావేశంలో జిల్లా సంయుక్త కార్యదర్శి సిరిగిరి శ్రీనివాసరావు, తిరుమలశెట్టి మల్లేశ్వరి, రాజుపాలెం మండల ఉపాధ్యక్షులు పసుపులేటి వెంకటస్వామి, అంచుల అనీష్, నకరికల్లు ఉపాధ్యక్షులు బత్తిన శ్రీనివాసరావు, బాధినీడు సుబ్బారావు, నాగూర్ వలి, దమ్మాలపాడు ఎంపీటీసీ సిరిగిరి రామారావు, పట్టణ నాయకులు రాడ్లు శ్రీనివాసరావు, సిరిగిరి మణికంత, బత్తుల ఆంజనేయులు, అల్లంశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు 180రోజులు..

విశాలాంధ్ర-వినుకొండ: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 180వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా గురువారం వినుకొండ పట్టణంలోని ఓబయ్య కాలనీ సచివాలయం పరిధిలోని 23 వార్డు (కోటనాల్స బజార్) నందు పట్టణ, సచివాలయం స్థాయి ఉద్యోగులను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వెంటపెట్టుకొని ప్రతీ గడపని సందర్శించారు. జగనన్న ప్రభుత్వం పేద కుటుంబాలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. పేదవాళ్ళకి సొంత ఇంటి కళ మీవల్లనే సాధ్యం అవుతుందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ తాను నియోజకవర్గంలో పూర్తి చేసిన ప్రతి పనిని మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చేశానని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేవలం 60 లక్షల రూపాయలతో పట్టణ తాగు నీటి సమస్యను తీర్చలేని నువ్వు వినుకొండని అభివృద్ధి చేశావంటే ప్రజలు ఎలా నమ్ముతారని అన్నారు. వినుకొండలో ఎన్నడు లేని విధంగా త్రాగు నీటి సమస్యను మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 3 నెలలోనే తీర్చడం జరిగిందని, వినుకొండ అభివృద్ధిలో భాగంగా శ్రీ రామలింగేశ్వర స్వామి గుడి కొండపైకి ఘాట్ రోడ్డు మరియు గిరిప్రదిక్షణ రోడ్డు, ఎన్.ఎస్.పి కాల్వ కట్టల ఆధునీకీకరణ,100 పడకల హాస్పటల్ నిర్మాణం, ఎన్.ఎస్.పి గ్రౌండ్ నందు షాపింగ్ కాంప్లెక్స్, అన్ని రకాలైన మర్కెట్స్ నిర్మాణానికి ప్రణాలికలు సిద్ధం చేయడం ప్రజలందరూ గమనిస్తున్నారని అన్నారు. వ్యవస్థలన్నా లెక్కలేకుండా ఏదో ఒక వినాశనం సృష్టించి ప్రభుత్వాన్ని నిందించాలన్నదే చంద్రబాబు తాపత్రయం అని బొల్లా అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నన్నేసా, దస్తగిరి షకీలా, వైస్ చైర్మన్ గాబ్రియేలు, ఎం రామ తులసి రెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు పిఎస్ ఖాన్ , తదితరులు పాల్గొన్నారు..

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని లేమల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, బూత్ కన్వీనర్ కట్టిపోగు బుజ్జి భార్య చిన్న మేరమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ సందర్భంగా పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గురువారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అమరావతి మండలంలోని కర్లపూడి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త ఆరుద్ర కోటేశ్వరరావు అనారోగ్యముతో మరణించగా వారి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా మండల పరిధిలోని ఉంగుటూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, ఎంపీటీసీ వెంకాయమ్మ భర్త కోయ లక్ష్మీప్రసాద్(చిన్న బుజ్జి) ఇటీవల అనారోగ్యముతో మరణించినారు. వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సుబ్బారెడ్డి మృతి

విశాలాంధ్ర-రొంపిచర్ల : స్థానిక వ్యవ సాయ మార్కె ట్ యార్డ్ మాజీ చైర్మన్, వైసీపీ సీనియర్ నాయ కులు గెల్లి సుబ్బారెడ్డి గురువారం తన స్వగృ హంలో గుండె పోటు తో మృతిచెం దారు. విషయం తెలుసుకున్న నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా రైతులకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన మృతి వైసీపీకి తీరని లోటన్నారు. వైసీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు చపారపు గోపాలరెడ్డి, యువజన విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు పడాల శివారెడ్డి, మండల కన్వీనర్ కురుగంటి శ్రీనివాసరెడ్డి, నాయకులు చపారపు సంజీవరెడ్డి, పచ్చవ రవి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బత్తుల రామకృష్ణ తదితరులు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

కృష్ణారెడ్డి కుటుంబానికి కాసు పరామర్శ

విశాలాంధ్ర-గురజాల : మూడు రోజుల క్రితం కొంతమంది దుండగుల చేతిలో దారుణ హత్యకు గురైన వైసీపీ కార్యకర్త కూనిరెడ్డి కృష్ణారెడ్డి కుటుంబాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి పరామర్శించారు. మండలంలోని జంగమహేశ్వరపురం గ్రామంలో కృష్ణారెడ్డి స్వగృహంలో అతనిని చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ అండగా ఉంటుందని, ధైర్యం కోల్పోవద్దని భరోసా కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే కాసు మీడియాతో మాట్లాడుతూ ఎంతో దారుణంగా వైసీపీ కార్యకర్త కృష్ణారెడ్డిని టీడీపీ నేతలు హత్య చేశారని, ప్రశాంతంగా ఉన్న గ్రామంలో అల్లర్లు సృష్టించాలని చూస్తున్నారని మండిపడ్డారు. యావజ్జీవ శిక్ష అనుభవిస్తూ బెయిల్ మీద వచ్చి హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా చార్జిషీట్ వేయాలని పోలీసులను కోరారు. హత్య చేసిన వారినే కాకుండా వారికి సహకరించిన వారు, సుపారీ ఇచ్చిన వారిని అందరిని శిక్షించే విధంగా చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే అన్నారు. కృష్ణారెడ్డి హత్య వెనుక యరపతినేని హస్తం ఉందా, మండల టీడీపీ నేతలు డబ్బులు సమకూర్చారా అనే విషయాలు అన్ని దర్యాప్తులో బయటకి వస్తాయని ఎమ్మెల్యే అన్నారు. అల్లర్లు సృష్టించి ఎన్నికల్లో గెలవాలి అనుకుంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటున్న వైసీపీ నాయకులను రెచ్చగొడితే తరువాత పరిస్థితి మరోలా ఉంటుందని హెచ్చరించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు సహనం కోల్పోతే టీడీపీ నేతల ఇళ్ళల్లోకి వెళ్లి కొడతారన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కృష్ణారెడ్డి హత్యలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న అందరిని కఠినంగా శిక్షించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీజీపీని, ఎస్పీని కలిసి కృష్ణారెడ్డి హత్య కేసులో సమగ్ర దర్యాప్తు చేసి నిందితులను శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరతామని, అనంతరం విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని కాసు తెలిపారు. పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పాలు పవన్మయి వీరారెడ్డి, వైస్ చైర్మన్లు షేక్ బడేజాని, మన్నెం ప్రసాదరావు, గాంధీ, మార్కెట్ యార్డ్ చైర్మన్ కలకండ ఆంద్రయ్య, కొమ్మినేని రవి, నాగుల్ మెస్త్రి, కుక్కమూడి అన్నారావు పాల్గొన్నారు.

8న విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయండి

విద్యార్థి, యువజన నాయకుల పిలుపు

విశాలాంధ్ర-నరసరావుపేట : కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం వచ్చే నెల 8న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలని విద్యార్థి, యువజన నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నరసరావుపేటలోని అవ్వారు భావన్నారా యణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ షేక్ సుభాని, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయ రాజు, ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ పోరాట సమితి(ఏపీఎన్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షులు మర్రి వేముల శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కోట సాయి, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు సాయి మాట్లాడుతూ అనేక త్యాగాలతో విద్యార్థి, యువజన నాయకులు 32 మంది ప్రాణ త్యాగాలతో, వామపక్ష ఎమ్మెల్యేల, ఎంపీల పదవి త్యాగంతో ఏర్పాటైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడాన్ని నిరసిస్తూ జరుగుతున్న పోరాటం నవంబర్ 8 నాటికి వెయ్యి రోజులు అవుతున్న సందర్భంగా అన్ని విద్యార్థి, యువజన సంఘాల ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొనడంతో పాటు నవంబర్ 8వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కి పిలుపునిచ్చారు. లాభాలు వస్తున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలని ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫ్యాక్టరీ అనుబంధంగా ఇనుము గనులు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాది మందికి ఉపయోగపడుతున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. రాయలసీమ ప్రాంతం కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని విభజన చట్టంలో పేర్కొన్న హామీ ఇంతవరకు ఏ మాత్రం అమలు చేయలేదని తెలిపారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధికి నిధులు ఇవ్వకపోయినా నూతన పరిశ్రమలు ఏర్పాటు వంటి విభజన హామీలు అన్నిటిపై నిర్లక్ష్యం చేస్తుంటే రాష్ట్రంలోని బీజేపీ నేతలు మోదీని ఎందుకు అడగడం లేదని విమర్శించారు. కేసుల భయంతో మోదీ ముందు మోకరిల్లుతున్నారని రాష్ట్ర విభజన హామీలలో ప్రధానమైన కడప ఉక్కు ఫ్యాక్టరీ కోసం కేంద్రం ఒక్క పైసా కూడా నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటు అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కడప ఉక్కు ఫ్యాక్టరీ కోసం రెండు సార్లు శంకుస్థాపన చేసిన ఆచరణలో పురోగతి లేదన్నారు. ఈ నెల 30వ తేదీన పల్నాడు జిల్లా నరసరావుపేటలో జిల్లా స్థాయిలో ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతున్నదని తెలిపారు. విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ఆనంద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గృహాలు, ఖాళీ స్థలాలకు చట్టబద్ధత కల్పించుకోవాలి

విశాలాంధ్ర-వినుకొండ: భూములు ఇంటి స్థలాలు, గృహాలు, రీ సర్వేలో భాగంగా అధికారులు తమ ఇళ్లకు వచ్చినప్పుడు ఉన్న పత్రాలను చూపెట్టి శాశ్వత హక్కు పత్రాలను పొందాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, కమిషనర్ డి.వెంకయ్య కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ ఛాంబర్ నందు సాధారణ సమావేశం నిర్వహించారు. అజెండాలో పొందుపరచిన 30 అంశాలలో 18,28 అంశాలను రద్దు చేస్తూ, మిగతా అంశాలు అన్నింటిని కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించి నిర్మానించినట్లు చైర్మన్ దస్తగిరి ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో భూములు, రీ సర్వే జరిపి చట్టబద్ధత కల్పించిన విధంగా మున్సిపాలిటీ పరిధిలో కూడా ఖాళీ స్థలాలకు, ఇళ్లకు పూర్తి హక్కు కల్పిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల ఇల్లు స్థలాలు, మరొకరికి రిజిస్ట్రేషన్ చేయాలన్న, అమ్ముకోవాలన్నా పూర్తి హక్కు ఉంటుందని కౌన్సిలర్లు ఆయా వార్డులోని ప్రజలకు అవగాహన కల్పించాలని వారు కోరారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు వార్డులోని పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తెచ్చారు.. ఎనిమిదవ వార్డ్ కౌన్సిలర్ బ్రహ్మయ్య మాట్లాడుతూ తమ వార్డులో కోతులు బెడద అధికంగా ఉండి ప్రజలు, చిన్నపిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారని, కోతులను పట్టించి ఇతర ప్రాంతాలకు తరలించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బజారులో లో వోల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందని, సమస్యను పరిష్కరించాలని, విద్యుత్ ఏఈ గౌస్‌ను కోరారు. మరో కౌన్సిలర్ మాట్లాడుతూ తల్లి పిల్లల ఆస్పత్రి ప్రాంతంలో మంచినీటి పైపులైన్లు పగిలిపోయి అందులో డ్రైనేజీ మురుగునీరు కలుస్తూ,మంచినీరు దుర్వాసన వస్తున్నాయని ప్రజలు ఆగ్రహిస్తున్నారని అధికారులు దృష్టికి తెచ్చారు. ఐదవ వార్డ్ కౌన్సిలర్ పోలూరి అంజలి మాట్లాడుతూ తమ వార్డులోని వీధుల్లో పిచ్చి కంప గడ్డి పెరిగిపోయి పాములు చేరి గృహాల్లోకి వస్తున్నాయి అంటూ గగ్గోలు పెట్టారు. 26వ వార్డు కౌన్సిలర్ గంట కాలేష మాట్లాడుతూ తమ వార్డులో మాట్లాడుతూ వర్కులు చేసే బాల సాయి కాంట్రాక్టర్, ఇతర ప్రాంతాల్లో ఉంటూ బినామీలచే వర్కులు చేపిస్తున్నాడని 35 లక్షల రూపాయల వర్కులు చేయాల్సి ఉండగా, కేవలం ఎనిమిది లక్షల రూపాయల వర్క్‌లు మాత్రమే చేసి మిగతా పనులు చేయలేదని ఆ కాంట్రాక్టర్ ను మార్చివేసి మరో కాంట్రాక్టర్కు వర్కులు అప్పచెప్పాలని చైర్మన్ దృష్టికి తెచ్చారు. మరో వార్డ్ కౌన్సిలర్ ఎంఎస్కే భాష మాట్లాడుతూ వీధుల్లో చెత్త వేసే డబ్బాలన్నీ పగిలిపోయాయని కొత్త డస్ట్ బిన్స్ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో.. కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ డి ఈ వెంకయ్య, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసరావు, ఏ ఈ చంద్రశేఖర్, సానిటరీ అధికారి చెన్నకేశవులు, టిపిఓ. వెంకటరమణ, విద్యుత్ ఏఈ. గౌస్, పాల్గొన్నారు.

గెల్లి సుబ్బారెడ్డికి సీపీఐ నాయకుల సంతాపం

విశాలాంధ్ర-రొంపిచర్ల : స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గెల్లి సుబ్బారెడ్డి మృతికి సీపీఐ నాయకులు గురువారం సంతాపం తెలియజేశారు. సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్ ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. యార్డ్ ఛైర్మన్‌గా, రైతు సంఘం నాయకులుగా రైతులకు చేసిన సేవలను కొనియాడారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు వై.చెంచయ్య సుబ్బారెడ్డి మృతికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు, నరసరావుపేట పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, మండల కార్యదర్శి రొద్దా అంజిరెడ్డి, మండల నాయకులు ముప్పూరి మధుసూదనరావు, చిట్యాల శ్రీనివాసరెడ్డి, పిడెం హుస్సేన్ తదితరులు సంతాపం తెలియజేశారు.

పార్టీ ఎదగకపోవడానికి కారణం జిల్లా అధ్యక్షుడే

విశాలాంధ్ర-సత్తెనపల్లి : జిల్లాలో పార్టీ సంస్థాగతంగా ఏదగకపోవటానికి జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు ప్రధాన కారణమని జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివరావు విమర్శించారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సత్తెనపల్లి నియోజకవర్గం బాధ్యతలు నిర్వహిస్తు పార్టీని జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో ముందుండే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బొర్రా వెంకట అప్పారావుపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ధూళిపాళ్ల సభలో స్వయంగా పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అప్పారావుని వైసీపీ కోవర్ట్‌గా విమర్శించటం సహేతకంకాదన్నారు. పార్టీలో ఇబ్బందులు ఉంటే పరిష్కరించాల్సిన పదవిలో ఉండి పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్న వ్యక్తులను విమర్శించటం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోందన్నారు. సమావేశంలో మండలాల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు సుమన్, నాగేశ్వరరావు, శిరిగిరి పవన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి ఎమ్మెల్యే విరాళం

విశాలాంధ్ర-దుర్గి : మండల కేంద్రమైన దుర్గిలో అయ్యప్పస్వామి అన్నదాన సేవా సమితి మాలధారణ స్వాముల కోసం ఏర్పాటు చేసిన ఉచిత అన్నదాన పథకానికి రూ.5 లక్షలు విరాళం ప్రభుత్వ విప్, జిల్లా అభివృద్ధి మండలి ఛైర్మన్, జిల్లా అధ్యక్షుడు, మాచర్ల శాసనసభ్యులు పిన్నెలి రామకృష్ణారెడ్డి ప్రకటించారని దుర్గి మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెలిదండి గోపాల్ గురువారం తెలిపారు. అన్నదాన పథకం ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే పిన్నెలి రామకృష్ణారెడ్డి బుధవారం దుర్గికి విచ్చేసి, అయ్యప్పస్వామి దేవస్థానంలో సేవా సమితి ఏర్పాటు చేసిన శ్రీహరిహర పుత్ర అయ్యప్పస్వామి ఉచిత అన్నదాన పథకానికి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు ఎమ్మెల్యేను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కె.గోపాల్, తోటకూర వెంకటేశ్వర్లు, యకటీల బుచ్చిబాబు, వై.చిన్న బాయి, కె.సూర్యనారాయణ, చింతా నరసింహారావు తదితరులు ఉన్నారు.

2న బేడ జంగం హక్కుల పోరాట సమితి కృతజ్ఞతా సభ

విశాలాంధ్ర-పెదకూరపాడు : బేడ(బుడ్గ) జంగం కులాన్ని తిరిగి ఎస్సీ జాబితాలో చేర్చాలని కేంద్రానికి పంపించడంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేడ(బుడ్గ) జంగం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నవంబర్ 2న కృతజ్ఞత సభ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు ఆవిష్కరించారు. గుంటూరులోని ఎమ్మెల్యే నివాసంలో బేడ జంగం హక్కుల పోరాట సమితి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేడ(బుడ్గ) జంగాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఎల్.మధు, విభూది శ్రీనివాసులుతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బుడ జంగం కులాన్ని తిరిగి ఎస్సీల్లో చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ మేరకు కేంద్రానికి కూడా పంపించామన్నారు. బడుగు బలహీన వర్గాలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందనడానికి ఇదే నిదర్శనమన్నారు. నవంబర్ 2న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే కృతజ్ఞత సభకు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రులు మేరుగ నాగార్జున, జోగి రమేష్, ఎంపీ నందిగం సురేష్, మల్లాది విష్ణువర్ధన్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, వైసీపీ యువజన విభాగ రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

సుబ్బారెడ్డి మృతికి కాసు సంతాపం

విశాలాంధ్ర-రొంపిచర్ల : స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ గెల్లి సుబ్బారెడ్డి మృతికి మాజీ మంత్రి కాసు కృష్ణారెడ్డి గురువారం సంతాపం తెలియజేశారు. ఆయన కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీలో దీర్ఘకాలం పనిచేసిన తనకు గెల్లి సుబ్బారెడ్డికి అవినాభావ సంబంధము ఉందని అన్నారు. ఆయన స్నేహశీలి, ప్రజాసమస్యలపై స్పష్టమైన అవగాహన కలిగిన వ్యక్తి అని అన్నారు. తాను మంత్రిగా ఉన్న హయాంలో రొంపిచర్లలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ తొలి ఛైర్మన్‌గా పనిచేసి రైతులకు ఎంతో సేవ చేశారని కొనియాడారు. కొద్ది రోజుల క్రితం తన ఇంట్లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొని ఎంతో అప్యాయతంగా మాట్లాడుకున్నామని అన్నారు. ఇంతలో ఆయన మృతి చెందడం తనను ఎంతో కలచివేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. తాను ప్రస్తుతం దూర ప్రాంతాలలో ఉన్నానని, కొద్ది రోజులలో ఆయన కుటుంబ సభ్యులను కలుస్తానని అన్నారు.

వెంకట సుబ్బమ్మ కుటుంబ సభ్యులకు పరామర్శ

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని మండేపూడి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కోట హరిబాబు మాతృమూర్తి వెంకట సుబ్బమ్మ ఇటీవల అనారోగ్యముతో మరణించారు. గురువారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు పరామర్శించారు. అనంతరం మండల పరిధిలోని మునుగోడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు షేక్ ఖాదర్ మస్తాన్ వలి కుమార్తె షేక్ సైదాబీ, షేక్ రెహమాన్‌ల వివాహ మహోత్సవానికి ఎమ్మెల్యే హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

బాబుపై ఎన్ని కేసులు పెట్టినా ప్రజలు నమ్మరు

విశాలాంధ్ర-పెదకూరపాడు : చంద్రబాబుపై జగన్ ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, అవినీతి ఆరోపణలు చేసిన రాష్ట్ర ప్రజలెవ్వరూ నమ్మరని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ ఒక ప్రకటనలో అన్నారు. జగన్‌మోహన్ రెడ్డి అక్రమ కేసులో ఇరికించి ఏ తప్పు చేయని చంద్రబాబుని ఇన్ని రోజులు జైల్లో పెట్టించాడని అన్నారు. చంద్రబాబు నాయుడు తప్పు చేయలేదు కాబట్టే ఆంధ్ర రాష్ట్ర ప్రజలే కాకుండా, ఇతర రాష్ట్రాల ప్రజలు, నాయకులు కూడా మద్దతు తెలుపుతున్నారన్నారు. చంద్రబాబు ఎప్పటికీ కడిగిన ముత్యమేనని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీని భూస్థాపితం చేస్తారని జోస్యం చెప్పారు.

ఘనంగా అంకమ్మ తల్లి వార్షికోత్సవం

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో చెన్నకేశవ స్వామి దేవస్థానంలో అంకమ్మ తల్లి దేవస్థానం నందు అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వక్సేన పుణ్యాహ మండప ఆరాధనలు దేవిమూల మంత్ర సహిత విశేష గణపతి నవగ్రహా మంత్ర సహిత మహా శాంతి హెూమ కార్యక్రమాన్ని అర్చకులు శ్రీనివాసచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి పసుపు కుంకుమ గాజులు విశేష సారెను సమర్పించారు. గ్రామస్తుల సహాయ సహకారాలతో విశేష అన్నదానం జరిగింది. భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

వరి పంట పొట్ట దశలో జాగ్రత్తలు అవసరం

విశాలాంధ్ర - చెరుకుపల్లి : ప్రస్తుతం ఉన్న వరి పంట పొట్ట దశలో ఉన్నప్పుడు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీ గంగాధర్ అన్నారు. గురువారం అయన మండల పరిధిలోని ఆరుంబాక గుళ్ళపల్లి గ్రామాలలోని పంట పొలాలను సందర్శించి రైతులకు పలు సూచనలు అందించారు. ప్రస్తుతం పొట్ట దశలో ఉన్న పొలాలలో 19 19 19 ఎరువులు ఐదు గ్రాముల చొప్పున లీటర్ నీటిలో కలిపి సాయంత్రం వేళలో పిచికారి చేయాలన్నారు. అదే పంట సుంకు దశలో ఉంటే ఈ ముందు వాడటం మంచిది కాదన్నారు. ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులు కనుగుణంగా వ్యవసాయ శాఖ సూచనలు సలహాలు పాటించి అధిక దిగుబడులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రియాంక గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

ఎంపీ చొరవతో గ్రామాభివృద్ధి

విశాలాంధ్ర - రేపల్లె : ఎంపీ మోపిదేవి వెంకటరమణ రావు చొరవతో పేటేరు గ్రామంలో పలు అభివృద్ధి పనులు జరిగినట్లు పేటేరు వైసీపీ ఇంచార్జ్ కనపర్తి రవికిరణ్ గుర్తు చేశారు. గ్రామానికి మంజూరైన రూ.5లక్షల మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం నిధులతో 8వ వార్డులో సీసీ రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. గురువారం సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసి,పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ఎంపీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గ్రామంలో ఇప్పటికే పలు సీసీ రోడ్లు, సచివాలయ భవనాలు, పంచాయతీ కార్యాలయ భవనం నిర్మించినట్లు తెలిపారు. ప్రస్తుతం 70 మీటర్లు పొడవు అంచనాలతో సీసీ రోడ్డు వేయనున్నట్లు చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష ఈనెల 28న రెండవ సచివాలయం పరిధిలో జరుగుతుందన్నారు. ప్రజలందరూ ఆరోగ్య పరీక్షలు చేయించు కోవాలని సూచించారు.

నేడు జిల్లా స్థాయి స్పందన

విశాలాంధ్ర - రేపల్లె : జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం శుక్రవారం పట్టణంలోని సీతరామ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ డివిజనల్ అధికారిని హేల షారోన్ తెలిపారు. జగనన్నాకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ప్రతి నియోజకవర్గ హెడ్ క్వార్టర్స్‌లో స్పందన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లుగా చెప్పారు. మండల ప్రజలు జిల్లా కేంద్రాల వరకు వెళ్లకుండా ఈ కార్యక్రామాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. స్పందనలో కలెక్టర్‌తో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్ సమక్షంలో అర్జీలు అందజేయాలని సూచించారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఆదేశించారు.

నేడు టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

విశాలాంధ్ర - వేమూరు : నియోజకవర్గ టీడీపీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం శుక్రవారం కొల్లూరు మండల కేంద్రంలోని ఎంప్లాయిస్ రిక్రియేషన్ హాలులో మధ్యాహ్నం రెండు గంటలకు నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీమంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు అధ్యక్షతన జరుగుతుందని వేమూరు నియోజకవర్గ తెదేపా కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేశారు. సమావేశానికి ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు, పార్టీలోని వివిధ స్థాయిల్లో ఉన్న నాయకులు కార్యకర్తలు సమావేశానికి రావాలని తెలియజేశారు.

ఈ క్రాఫ్ట్ బుకింగ్ ముసాయిదా జాబితా విడుదల

విశాలాంధ్ర - వేమూరు : మండల పరిధిలోని గ్రామాల్లో ఖరీఫ్‌లో వరి సాగు చేసిన పంటలకు ఈ క్రాఫ్ట్ బుకింగ్ నమోదు పూర్తయిందని ఇప్పటివరకు ఈ క్రాఫ్ట్ నమోదు చేసుకున్న రైతుల జాబితాలను ప్రకటిస్తారని మండల వ్యవసాయ అధికారి సునీత తెలియజేశారు. శుక్రవారం నుంచి మండల స్థాయిలో గ్రామసభలు నిర్వహించి ఆ గ్రామ సభల ద్వారా ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతుల జాబితాలను ప్రకటించనున్నట్లు తెలియపరిచారు. రైతులు సామాజిక తనిఖీ చేసుకుని జాబితాలో తమ పేర్లు నమోదు కానట్లయితే తిరిగి నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తారన్నారు. రైతులు ఆయా ఆర్బికే కేంద్రాల్లో జాబితాలు పరీక్షించుకోవాలని సూచించారు. 2023 ఖరీఫ్ సీజన్లో మండలంలో 16 వేల ఎకరాల ఈ క్రాఫ్ట్ నమోదైనట్లు, రైతులు తమ పేర్లను పరీక్షించుకోవాలని ఆమె తెలియజేశారు.

గ్రామ దర్శిని విజయవంతం చేయండి

విశాలాంధ్ర -బాపట్ల : జిల్లాలో గ్రామ దర్శిని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామ దర్శిని కార్యక్రమాన్ని అమలు చేయడానికి మొదటి విడత 70 మంది అధికారులను గ్రామ దర్శిని స్పెషల్ ఆఫీసర్లుగా నియమించడము జరిగిందన్నారు.గ్రామ దర్శిని స్పెషల్ ఆఫీసర్లు ప్రతి గ్రామ పంచాయతీని సందర్శించాలన్నారు.గ్రామ పంచాయతీలో ఉన్న ప్రభుత్వ సంస్థలను తనిఖీ చేయాలన్నారు.ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు,హాస్పిటల్స్,అంగన్ వాడి కేంద్రాలు,తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు.గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి నివేదికను తయారు చేసి వెబ్ సైట్‌లో అప్ లోడ్ చేయాలని ఆయన చెప్పారు.గ్రామ దర్శిని స్పెషల్ ఆఫీసర్లు గ్రామాల్లో ఉన్న సమస్యలను కనీసం రెండింటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సి.పి.ఓ భరత్ కుమార్,డి.పి.ఓ దాసరి రాంబాబు,డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్ రావు,డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్,గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్,పశుసంవర్ధక శాఖ జె.డి హనుమంతరావు, సాంఘీక సంక్షేమ శాఖ డి.డి రాజ్ దిబోరా తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు సాగు నీరు అందించాలి

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : మా పొలలాకి సాగు నీరు అందించండి అంటూ నరసాయపాలెం రైతులు రూరల్ పోలీసులకి ఫిర్యాదు చేశారు. నరసాయపాలెం గ్రామానికి చెందిన రైతులు గురువారం ఇరిగేషన్ అధికారులు స్పందించడం లేదంటూ వారాబంధీ ద్వారా వస్తున్న నీటిని మోటార్లు పెట్టుకుని దిగువ పొలాలకు నిరంధించకుండా పై పొలాలకు నీరు పెట్టుకుంటున్నారని సమస్యను పరిష్కరించాలని బాపట్ల రూరల్ సీఐ వేణుగోపాల్ రెడ్డికి ఫిర్యాదు చేశారు.

ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోండి: కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు. గురువారం బాపట్ల మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఈ క్యాంపు ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ కార్యక్రమాన్ని గత నెల 28న ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 95 శాతం గ్రామ,వార్డు సచివాలయాల పరిధిలో నిర్వహించా రన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష గ్రామ,వార్డు సచివాల యాల్లో సుమారు 400 నుండి 500 మంది వైద్య పరీ క్షలకు హాజరవుతున్నారన్నారు. ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన ముందులు ఇస్తారన్నారు. ఆపరేషన్‌లు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం క్రింది కార్పొరేట్ హాస్పిటల్స్‌కు పంపుతార న్నారు. ఈ సందర్భంగా బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చింద న్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి కార్పొ రేట్ హాస్పిటల్స్ చికిత్సలు అందిస్తారన్నారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ చేయడానికి ముఖ్యమంత్రి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారు. ప్రజలకు అవసర మైన ఉపాధి ఉద్యోగ అవకాశాలు ప్రభుత్వం కల్పించింద న్నారు. ఈసందర్భంగా వారు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, బాపట్ల మున్సిపల్ కమిషనర్ ఎ.భాను ప్రతాప్, తహసీల్దార్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి: ఎస్పీ

విశాలాంధ్ర -బాపట్ల : చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ఓపెన్ హౌస్ లాంటి కార్యక్రమాల వలన విద్యార్థులకు విజ్ఞానం పెంపొందుతుందని తెలిపారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఏటా అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే స్మారకోత్సవాలలో భాగంగా గురువారం జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్ దగ్గర వున్న ప్రకృతి వనంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో ఉపయోగించే వివిధ పరికరాలు వాటి పనితీరు, సాంకేతిక సాధనలను గురించి, వేలిముద్రలు సేకరించు పరికరాలు వాటి ఉపయోగాల గురించి ఎస్పీ స్వయంగా విద్యార్థులకు వివరించారు. ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని వీక్షించడానికి జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థిని, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పోలీస్ అధికారులు విఐపి బందోబస్తులలో, ప్రధానమైన కార్యాలయాలలో తనిఖీకి ఉపయోగించే డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్, హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్, పాకెట్ స్కానర్,నాన్ లైనర్ జంక్షన్ డిటెక్టర్‌ల గురించి, భూమిలో పాతిపెట్టిన పేలుడు పదార్థాలను గుర్తించడానికి ఉపయోగించే డీప్ సెర్చింగ్ మెటల్ డిటెక్టర్ గురించి, వాహనాల క్రింది భాగాన్ని తనిఖీ చెయ్యడానికి ఉపయోగించే వెహికల్ ఇన్స్పెక్షన్ మిర్రర్ గురించి,డ్రాగన్ లైట్, సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆపే జామర్, పోలీసులు సంబాషించుకోవడానికి ఉపయోగించే మ్యాన్ ప్యాక్, సెట్స్‌ల గురించి,నేర పరిశోధనలో ఉపయోగించే పోలీస్ జాగిలాల బృందాల గురించి, నైట్ విజన్, డే విజన్ పరికరాలు, బైనాక్యులర్‌ల గురించి, పోలీస్ కంట్రోల్ రూమ్‌లో ఉండే బాడి వోర్న్ కెమెరాలు, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ కెమెరాల గురించి, డ్రోన్ కెమెరాలు, డ్రోన్‌ల గురించి, విపత్తుల సమయంలో ఉపయోగించే పరికరాల గురించి, ట్రాఫిక్ రూల్స్, ట్రాఫిక్ చిహ్నాల గురించి, దయల్ -100 ,112, దిశ యాప్‌ల పనితీరు గురించి, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌ల గురించి, పోలీస్ అధికారుల ర్యాంకులు వారు నిర్వహించు విధుల గురించి, సమాజంలో పోలీసు పాత్ర గురించి విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా బాపట్ల పోలీస్ పరేడ్ గ్రౌండ్లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను ఆహ్వానించడం జరిగిందన్నారు. పోలీసులు విధులు ఎలా నిర్వహిస్తారు, విధులు నిర్వహించే సందర్భాలలో ఎటువంటి పరికరాలను ఉపయోగిస్తారు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి పోలీస్ శాఖలో ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానాన్ని గురించి, విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు శాంతి భద్రతలను పరిరక్షించడానికి పోలీసులు ఏ విధంగా కృషి చేస్తారు, పోలీస్ శాఖ అమలుపరుస్తున్న వివిధ కార్యక్రమాల గురించి కూలంకషంగా విద్యార్థులకు వివరించడం జరిగిందన్నారు. పోలీసుల విధులు,వారు వాడే ఆయుధాలు, పరికరాలు, బాధ్యతలు, శాంతిభద్ర నిర్వహణ తదితర అంశాలను విద్యార్థి దశలోనే తెలుసుకోడానికి ఓపెన్ హౌస్ కార్యక్రమం దోహదపడుతుందన్నారు.ఇటువంటి కార్యక్రమాల వలన విద్యార్థిని,విద్యార్థులకు విజ్ఞానం పెరుగుతుందని,వారి భవిషత్తు స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌లోని సర్కిల్, సబ్ డివిజన్ కార్యాలయాలలో కూడా ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించి పోలీస్ శాఖ పనితీరు, రికార్డుల నిర్వహణ గురించి విద్యార్థులకు వివరించడం జరుగుతుందన్నారు.విద్యార్థులు బాగా చదువుకొని, క్రమశిక్షణ అలవర్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి పి.మహేష్, ఏ.ఆర్ డి.ఎస్.పి ఎమ్.డి.హెచ్ ప్రేమ్ కుమార్, బాపట్ల డి.ఎస్.పి టి.వెంకటేశులు, ఎస్.బి సిఐ వి.సూర్యనారాయణ,అడ్మిన్ ఆర్.ఐ ఎల్.మన్మధరావు, వెల్ఫేయిర్ ఆర్.ఐ బి.శ్రీకాంత్ నాయక్, హెూంగార్డ్ ఆర్.ఐ ఎల్.గోపీనాథ్, ఐ.టి కోర్ విభాగం ఆర్.ఎస్.ఐ సి.జె.భరత్,ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యపరచడమే సైకిల్ యాత్ర లక్ష్యం

విశాలాంధ్ర-అద్దంకి ; తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుపై ప్రజలను చైతన్యపరచడమే లక్ష్యంగా నియోజకవర్గవ్యాప్తంగా మండల కేంద్రాల్లో సైకిల్ యాత్ర చేపట్టినట్లు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ గురువారం జె,పంగులూరు మండల పార్టీ ఆధ్వర్యంలో కశ్యాపురం గ్రామం నుంచి రేణింగవరం,కొండమూరు గ్రామాల మీదుగా జనకవరం వరకు 10 కిలోమీటర్లు ఎమ్మెల్యే రవికుమార్ ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర చేపట్టారు. చంద్రబాబు అక్రమ అరెస్టు, నిర్బంధం గురించి ప్రజలకు వివరిస్తూ సాగిన సైకిల్ యాత్రలో జె,పంగులూరు మండల తెలుగుదేశంపార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పంచల వేడుకల్లో కృష్ణచైతన్య

విశాలాంధ్ర-అద్దంకి ; మండలంలోని బొమ్మనంపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కామేపల్లి హనుమంతరావు మనువళ్ళు నూతన పంచల వేడుక గురువారం పట్టణంలోని కూకట్ల కన్వెన్షన్ నందు జరగ్గా నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య హాజరై చిన్నారులు సొమిత్,రోహన్‌లను ఆశీర్వదించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోరంట్ల పద్మావతి, వైసీపీ నాయకులు సందిరెడ్డి రమేష్, గోరంట్ల శ్రీనివాసరావు, శివాజి పాల్గొన్నారు.

వివాహ వేడుకలో కృష్ణచైతన్య

విశాలాంధ్ర-అద్దంకి ; జె,పంగులూరు మండలం పంగులూరు గ్రామానికి చెందిన పోతుగంటి వారి షాదీ ముబార్‌కకు గురువారం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య హాజరై నూతన వధూవరులు శ్రీకన్య,బాజీలను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు.

దేశంలో కుల జన గణన జరగాలి

విశాలాంధ్ర బాపట్లటౌన్ : దేశంలో కుల జన గణ జరగాలని మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్ వలి తెలిపారు.బాపట్ల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దొనెపూడి దేవరాజ్ ఆధ్వర్యంలో బాపట్ల టౌన్ పరిధిలోని డాక్టర్ బి.అర్ అంబెద్కర్ భవన్ నందు విలేకర్ల సమావేశంను నిర్వహించారు.ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా మాజీ శాసన సభ్యులు మస్తాన్ వలీ హాజరై ఆయన మాట్లాడుతూ గుంటూరులో జరిగే బిసి కులగణ డిమాండ్‌పై చర్చగా,దేశ వ్యాప్తంగా బిజెపి చేస్తున్న మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలు అందరు పెద్ద ఎత్తున ఉద్యమించాలనీ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే ఎస్.కే మస్తాన్ వలి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గుంటూరు జిల్లా అధ్యక్షులు ఈశ్వరరావు, మంగళగిరి ఇంచార్జీ సలీం, బాపట్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతా బాబురావు, మైనార్టీ నాయకులు పఠాన్ రాజేష్, మహిళా నాయకురాలు దండు రేణుకా,మాజీ కౌన్సిలర్లు నక్కల రాంబాబు,బక్కా రోశయ్య,ఇస్సాక్, కాంగ్రెస్ పార్టీ బాపట్ల మండల అధ్యక్షుడు శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో రేపు సామాజిక సాధికార బస్సు యాత్ర

జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కోన పిలుపు

విశాలాంధ్ర - బాపట్ల : అత్యంత ప్రతిష్టాత్మకంగా నియోజకవర్గంలో శనివారం నిర్వహించ తలపెట్టిన సామాజిక బస్సుయాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కోన రఘుపతి కోరారు.స్థానిక వైసీపీ కార్యాలయంలో పార్టీశ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన రెడ్డి పిలుపుమేరకు సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరిని గౌరవిస్తూ ప్రతి కార్యక్రమం ద్వారా సమన్యాయం చేయటం జరుగుతుందన్నారు.చేస్తున్న పని చెప్పటం బాధ్యత అన్నారు.రాష్ట్రంలో 50 కార్పోరేషన్లు ఏర్పాటు చేసి ప్రతి సామాజిక వర్గానికి గుర్తింపు తెచ్చామన్నారు.రాజకీయ వివక్ష లేని పాలనందిస్తూ అర్హతే ప్రామాణికంగా సేవలందిస్తున్నామన్నారు.వీటి గురించి ప్రజలకు వివరించేందుకు బస్సుయాత్ర ఉదయం11గంటలకు సంగుపాలెం కోడూరు నుండి ప్రారంభమై చందోలు, కర్లపాలెం మీదుగా బాపట్ల చేరుకుంటుందన్నారు. ఫ్యాడిషన్‌పేట దగ్గర నుంచి పాదయాత్రగా 3గంటలకు అంబేద్కర్ సర్కిల్ చేరుకొని అక్కడ జరిగే సభలో వక్తలు ప్రసంగిస్తారన్నారు .కావున ప్రతి ఒక్కరు హాజరు కావాలని కోరారు.ఈ సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షులు కాగిత సుధీరాబాబు,జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ పీటా వెంకటేశ్వరరావు,నాయకులు చింతలు రాజశేఖర్, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, జోగి, రాజా, గేరా యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ యాత్రలపై విమర్శలు మానుకోవాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును స్కిల్ డెవలప్మెంట్ కేసులో అరెస్టు చేసి జైలుకు తరలిం చారని, దీనిపై ఇంతవరకు ఆధారాలు చూపడం లేదని, ఇందుకు నిరసనగా నారా భువనేశ్వరి నిజం గెలవాలి అని యాత్రలు చేస్తుంటే వైకాపా నాయకులు అవాకులు చవాకులు మాట్లాడటం సరికాదని తెదేపా ఇంఛార్జి ఎం.ఎం కొండయ్య అన్నారు. మండలంలోని ఈపురుపాలెంలో తెదేపా నాయకులు, కార్యకర్తలుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టును జీర్ణించుకోలేని ఆయన అభిమానుల గుండెలు ఆగిపోతే వారిని పరామర్శిస్తూ యాత్ర నిర్వహిస్తున్న నారా భువనేశ్వరిపై విమర్శలు మానుకోవాలన్నారు.ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని,తగు సమయంలో వైకాపా ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.చంద్రబాబు అక్రమ అరెస్టు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో గుర్రం వెంకటేశ్వర్లు,గుద్దంటి చంద్రమౌళి, గంజి పురుషోత్తం, కౌతరపు జనార్ధన్ రావు, తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వర్షాభావ పరిస్థితుల్లో వరి, మొక్కజొన్న వేయొద్దు..

విశాలాంధ్ర - మార్టూరు : ప్రస్తుత వర్షాభావ పరిస్థితిలో రైతులు వరి మొక్కజొన్న పంటలు సాగు చేసి నష్టపోవద్దని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ విజయనిర్మల అన్నారు.గురువారం మార్టూరు డివిజన్‌లోని రైతులకు ఆత్మ ప్రకాశం జిల్లా వారి ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలుచే అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగింది.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ విజయ నిర్మల మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల ఉన్నందున రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపేరు.వారు మాట్లాడుతూ మార్టూరు సబ్ డివిజన్ పరిధిలో రబి సీజన్ నందు ఎక్కువుగా మొక్క జొన్న, వరి సాగు చేయటం జరుగుతుంది.కానీ ఈ సంవత్సరం సాగర్ నీరు విడుదల చేయనందున మొక్క జొన్న, వరి సాగుచేయలేని పరిస్థి ఏర్పడిందని తెలిపేరు.అనంతరం బాపట్ల డాట్ సి కోఆర్డినేటర్ డాక్టర్ ఓబయ్య మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థిలో నల్ల రేగడ భూముల్లో సెనగ పంట సాగుచేసుకోవటం మంచిదని తెలిపారు.మంచి దిగుబడులు పొందుటకు ఎన్బిఈబి 47,ఎన్బిఈజీ 49 రకాలు ఉపయోగపడతాయని తెలిపారు.విత్తనాలు పొందదల్చిన రైతులు నంద్యాల రీసెర్చ్ స్టేషన్‌ను సంప్రదించవచ్చు అని తెలిపారు. శాస్త్రవేత్త డాక్టర మృదుల మాట్లాడుతూ తేలికపాటి నేలలో మినుము,పెసర,ఉలవలు, జొన్నలు, సొయా చిక్కుడు సాగు చేసుకోవచ్చు అని తెలిపారు.మినుము ఎల్బీజీ 904,పి.యు 31, టీబీజీ 104,టీ9 రకాలు పల్లాకు తెగులు తట్టుకుంటాయని అని తెలిపారు. అలాగే చలి వాతావరణం వలన మినుములో భుడిద తెగులు సోకుతుంది కావున నివారణకు హెక్సకొనజాల 1 ఎంఎల్ లేదా ప్రోపికనోజోల 2 ఎల్ మార్చి మార్చి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. జిల్లా ఉద్యానశాఖాధికారి జెన్నమ్మ మాట్లాడుతూ రైతులకు రాయితీ పై టైవాన్ స్ప్రేయర్స్, బిందు సేద్యం, చిన్న ట్రాక్టర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కావాల్సిన రైతులు మార్టూరు ఉద్యనవనశాఖాధికారి బి.హనుమంత నాయక్‌ని కలవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ వై.పద్మావతి వారి పథకాలను వివరించారు.ఈ కార్యక్రమంలో మార్టూరు ,బల్లికురవ మండల వ్యవసాయ అధికారులు వి.కిరణ్ కుమార్,ఎస్.వి పి కుమారి,మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పెంటల సత్యనారాయణ నాలుగు మండలాల రైతులు గ్రామ వ్యాసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలు

విశాలాంధ్ర - రేపల్లె : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని రెవెన్యూ డివిజల్ అధికారిణి హేల షారోన్ అన్నారు. గురువారం పట్టణంలోని అయోవా హైస్కూల్ లో 14, 15 వార్డు సచివాలయాలకు ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్షా శిబిరాన్ని ఆమె పరిశీలించి ఓపి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను, మందులు, ఇతర సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కొరకు వైద్య సేవలు అందించటమే ఆరోగ్య సురక్షా ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. డాక్టర్లు అందరూ నిబద్ధతతో పనిచేస్తున్నారని కొనియాడారు. ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యము అందించాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయం అన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్య సురక్షా సేవలు ఉపయోగించుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లిఖార్జున రావు,మున్సిపల్ కమిషనర్ విజయ సారధి పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రేపల్లె యువజన అధ్యక్షుడిగా వెంకట్రావు

విశాలాంధ్ర - నిజాంపట్నం : బీసీ సంక్షేమ సంఘం రేపల్లె నియోజకవర్గ యువజన అధ్యక్షులుగా నిజాంపట్నం మండలానికి చెందిన కొనికి వెంకట్రావు నియమితులయ్యారు. గుంటూరులో జరిగిన బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో వెంక ట్రావుకు ఏపీ బీసీ సంక్షేమ సంఘం యువజన రాష్ట్ర అధ్యక్షులు కుమ్మరి క్రాంతి కుమార్ నియా మక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో అప్పజెప్పిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని, బీసీలందరిని సంఘటితపరచి హక్కుల సాధనకు పోరాడతానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావుకు ప్రత్యేక కృతజ్ఞ తలు తెలిపారు. వెంకట్రావు నియామకంపై బీసీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, పలువురు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల ఆధ్వర్యంలో రోటరీ సామాజిక భవనంలో సీనియర్ రోటరీ క్లబ్ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది బందారుపల్లి హేమంత్ కుమార్ విజయవాడలోని శ్రీచైతన్య కాలేజీలో ఐఐటి కోచింగ్ తీసుకొంటున్న చీరాలకు చెందిన పేద విద్యార్థిని బోగిరెడ్డి సంయుక్త ఫీజు నిమిత్తం రూ.25 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచిగా విద్యాభ్యాసం పూర్తి చేసి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాక్షించారు. 10వ తరగతి,ఇంటర్ మొదటి సంవత్సరంలలో ప్రసాద నగరం దొబేరా బాలికల వసతి గృహంలో వుండి మంచి మార్కులు సాధించిన ఈ విద్యార్థిని మరెన్నో విజయాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మామిడాల శ్రీనివాసరావు, పోలుదాసు రామకృష్ణ, జి.వై.ప్రసాద్, డి.వి.సురేష్, డా.బాబూరావు, ఎం.వి.రామారావు, దేగల తిరుపతిరావు, నక్కల సురేష్, శివాంజనేయప్రసాద్, మోహనరావు, శంకరరెడ్డి, విద్యార్థిని కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యువతుల కోసం సరికొత్త పార్టీ వేర్ వాచ్ బ్రాండ్ ఫాస్ట్రాక్ వైబ్

గుంటూరు: భారతదేశపు ఐకానిక్ యూత్ బ్రాండ్, ఫాస్ట్రాక్, ఇటీవల యువతుల కోసం ప్రత్యేకంగా ఒక సబ్-బ్రాండ్ అయిన వైబ్ ని ప్రారంభించింది. చిక్, స్టైలిష్, వినూత్నమైన వైబ్ ట్రెండ్‌లు, తాజా డిజైన్‌ల ప్రపంచాన్ని ఆస్వాదించే ఫ్యాషన్‌వాదులకు అంకితం చేయబడింది. ప్రస్తుత ఫాస్ట్-ఫ్యాషన్ ప్రాధాన్యతలపై దృష్టి సారించి, వైబ్ బై ఫాస్ట్రాక్ అన్ని రకాల పార్టీల కోసం అందాన్ని మెరుగుపరిచే అద్భుతమైన, విలువైన పీస్ ల కోసం వెతుకుతున్న వారికి అందిస్తుంది. మొదటి కలెక్షన్ డ్రాప్‌లో 71 ఉత్కంఠభరితమైన డిజైన్‌లు ఉన్నాయి. విభిన్నమైన మరియు అలంకరించబడిన పట్టీలు, కొత్త ప్లేటింగ్ రంగులు మరియు ఆసక్తికరమైన డయల్ ఆకారాల శ్రేణితో, బ్రాండ్ ప్రతి మూడ్, క్షణానికి వాచ్ ఉండేలా చేస్తుంది. అన్నింటికంటే అగ్రగామిగా, ఈ వాచీలు సరసమైన ధర శ్రేణి లో రూ. 1250 నుండి రూ. 2960 మధ్య లభిస్తాయి.

పీడియాట్రిక్ అక్యూట్ టి-లింఫోబ్లాస్టిక్ లుకేమియాకు ఏవోఐలో విజయవంతంగా చికిత్స

గుంటూరు: దక్షిణాసియాలోని అతిపెద్ద క్యాన్సర్ గొలుసు ఆసుపత్రుల్లో భాగమైన గుంటూరులోని అమెరికన్ ఆంకాలజీ ఇన్స్టిట్యూట్ , అక్యూట్ టి-లింఫోబ్లాస్టిక్ లుకేమియాతో బాధపడుతున్న నాలుగేళ్ల తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారికి విజయవంతంగా చికిత్స చేసి రక్షించింది. ఈ వయస్సు పిల్లలు సాధారణంగా 16-20 కిలోల ఆదర్శవంతమైన బరువు ఉండాల్సి వున్నప్పటికీ, ఈ పిల్లవాడు కేవలం 9 కిలోల బరువు మాత్రమే ఉన్నాడు. క్యాకెక్సియా యొక్క తీవ్రత కారణంగా రోగికి బహుళ కేంద్రాలలో చికిత్స నిరాకరించబడినందున ఈ అసాధారణమైన కేసు ఒక ముఖ్యమైన సవాలుగా హాస్పిటల్ కు నిలిచింది. ఏవోఐలోని కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రాంప్రహ్లాద్ కె ఎం మార్గదర్శకత్వంలో, పిల్లవాడిని పోషకాహార, శక్తివంతమైన ఆహార ప్రణాళికలో ఉంచారు. కీమోథెరపీ సమయంలో, ఆ పిల్లవాడు వివిధ రకాల ఇన్ఫెక్షన్లను ఎదుర్కొన్నాడు. నిపుణులైన వైద్య ఆంకోలాజికల్ బృందం, అంకితమైన నర్సింగ్ సిబ్బంది ఈ ఇన్ఫెక్షన్లను నిర్వహించడానికి, చికిత్స చేయడానికి కలిసి పనిచేశారు, చివరికి న్యూట్రోపెనిక్ సెప్సిస్ నుండి కోలుకోవడంలో ఆ చిన్నారికి అది సహాయపడిందని ఏవోఐ ఆర్సీవోవో మహేంద్రరెడ్డి అన్నారు.

పబ్లిక్ ఇష్యూకు ఇన్‌క్రెడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

విశాలాంధ్ర/గుంటూరు: ఇన్‌క్రెడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (గతంలో కేకేఆర్ ఇండియా ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ అని పిలిచేవారు) పబ్లిక్ ఇష్యూ కోసం అక్టోబర్ 11, 2023న ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసినట్లు ఇన్‌క్రెడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ హెూల్ టైమ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ భూపిందర్ సింగ్ తెలిపారు. ఒక్కొక్కటి రూ.వెయ్యి ముఖ విలువ కలిగిన లిస్టెడ్, రీడీమ్ చేయదగిన, కన్వర్టబుల్ కాని డిబెంచర్లు ఉన్నాయన్నారు. ఇష్యూ బుధవారం, అక్టోబర్ 25, 2023న తెరిచినట్లు చెప్పారు. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్‌కు అనుగుణంగా కంపెనీ డైరెక్టర్ల బోర్డు లేదా ఫైనాన్స్ కమిటీ నిర్ణయించిన విధంగా ముందస్తుగా మూసివేయడం లేదా పొడిగింపు ఎంపికతో నవంబర్ 7, 2023 మంగళవారం ముగుస్తుందని తెలిపారు. రూ. 300 కోట్ల వరకు సురక్షిత ఎన్సీడీల కోసం ఈ ఇష్యూ అన్నారు.